వాళ్లు అన్నమాట ముమ్మాటికీ నిజం! నిరపరాధులం మన మందరమూ! మనమీద ఎందుకు పడతాయి బాంబూలు? మన మీద ఎందుకు ఎగురుతాయి శత్రువిమానాలు" అంటూ చిరునవ్వు నవ్వింది!

ఆకాశం మీద చంద్రుడు మేఘంలోంచి వెలువడ్డంచూస్తూ పరమేశ్వరం "కొత్తవెన్నెల్తో ఆమె చిరునవ్వును పోల్చే" నన్నాడు.

... ... ... ... ...

## కారియర్ భోజనం

విద్యార్థి వివేకానందరావు కళాశాలా విద్యార్థే కాకుండా వసతి గృహనివాసి కూడాను. బంధువులు మిత్రులు ఎవరైనా ఎప్పుడైనా అతణ్ణి "మీ హాస్టల్లో భోజనం ఎలావుంటుందోయ్?" అని అడిగితే— "ఏమిటి చెప్పండి హాస్టల్ మీల్సు హెూమ్లీగా వుండవండీ" అనో "వుండవురా?" అనో జవాబు చెప్పేసెయ్యడం పరిపాటి. ఈ పరిపాటితోపాటు వసతి గృహంతో సంబంధం వదుల్చుకుందా మనే తలంపుకూడా అతనిలో సోపాన వారీగా రేకెత్తింది.

మొదటి సోపానం వసతిగృహంలో భోజనంమాత్రమేచేస్తూ చదువుకునే గది వేరే రోమవీధిని ఏర్పాటు చేసుకోవడం-రెండవ సోపానం ఆ గదిక్రిందదల్లా మేడమీద గదిగా చేసుకోవడం-మూడవ సోపానం కళాశాలా వసతిగృహంలో అల్పాహారం కాఫీ తేనీరు మానివేసి ఏతత్పదార్థాలు వెలువల ఒకానొక పెద్ద భోజన కాఫీ హెూటల్లో తీసికోవడం.

ఈ మూడవ సోపానం ఎక్కాక ఓనాడు ఏంజరిగిందీ అంటే వివేకానందరావు-నేనన్న-పెద్ద భోజన కాఫీ హెూటల్లో గుండ్ర బల్లదగ్గరనున్న కుర్చీమీద కూర్చుని పెసరట్టు ఉప్మా రెండూ మిళితంగా సొంతచేత్తో మణుచుకు నోటపెట్టుకుంటూ ఉదయం

9 గంటలప్పుడు ఓ కిటికీ అమ్మట చూశాడు. కిటికీ బార్లా తీసి వుంది–ఇనప కిటికీ కటకటాలు శరీరాన్ని అరికట్టేటట్టున్నాయి గాని చూపుల్ని అరికట్టేలా లేవు. బాహాటంగా అతని చూడ్కులు అవలకు ప్రసరించిపోతున్నాయి. అవల వసారా–ఆ వసారాలో తళుక్కుమన్నట్టయింది వివేకానందరావుకి–ఓ పడుచుపిల్ల, పిల్ల చేతిలో పరిశుభ్రంగా తోమబడ్డ ఇత్తడి కారియర్. పిల్ల ముక్కుని ఓ బంగారుపుడక, పిల్ల మెళ్లో ఓ బంగారు నగ–తళుక్కుమన్నది. "కాంక్రీట్" వస్తువో లేక "ఏబ్స్ట్రాక్టు" వయస్సో చెప్పుకోలేక వివేకానందరావు వెంటవెంటనే పరిభ్రమించిపోయి అటూ ఇటూ చూచేడు. తనచుట్టూ ఎటుచూచినా కిటికీలే! తను కూర్చున్నది విపరీతపు పెద్దహాలు. హాల్లో తనేకాకుండా వందమంది కూర్చుని వున్నారు. రేడియో పాడుతూవుంది. 'బంయా' 'దునియా' 'మేరే బుల్‌బుల్' ఇత్యాది 'సిలబల్సు' వెలువరిస్తూ—యంత్రం వోమూలవుంది. లౌడ్‌స్పీకర్ ఓవైపు వేలాడుతూవుంది. పింగాణీ గిన్నెలు పళ్ళ్యాలు క్లింక్ క్లాంక్ చెవులతుప్పుడు వదిలిస్తూవుంది. హొటల్ మేనేజర్ అయ్యర్ బల్లదగ్గర చిల్లర చిందు త్రొక్కుతూ వుంది. లోలోపల భవనంలో వేగింపులుతిరగ మోతలు ఛుంయి ఛుంయి లాడిస్తున్నాయి. అన్నిటికంటె చిత్రం! చుట్టూ కిటికీలంట కంటూవుంటె పాలట్టుకొచ్చే పడుచులు, పెరుగుతెచ్చే పణతులు మరిన్నీ మరిన్నీ మెరిసిపోయే కారియర్లుమోసే కన్నె పిల్లలు యెందరెందరో ఊగులాట కీచులాట నెచ్చరిగనున్నవార లగపించేరు.

వివేకానందరావు ఇన్నింటి ఇరుకునాపడి మనోవికారం పొందినా అసలు మఱచిపోనివాడై తిన్నగా కాఫీ త్రాగి పెదాలు జేబురుమాల్తో తుడుచుకుంటూ మేనేజరు మేజాదగ్గరకువెళ్ళి ఎవరూ లేకుండాచూచి ఏదో వూదాడు అయ్యర్ చెవిలో; ఎడ్వాన్సు మణీగా పదిరూపాయలనోటు పెట్టాడు. వెంటనే తన

గదిలోకివెళ్ళి కళాశాలా వసతి గృహాధికారికి నాటినుండి తనకు వసతిగృహ భోజనం అక్కరలేదని వుత్తరంవ్రాసి పంపేశాడు. తాను హెూమ్ ఏర్పరుచుకున్నాను అని తాజాకలం తగిలించాడు. ఈ వివేకానందరావు యొక్క "హెూమ్" అన్న ముక్క ప్రపంచ మంతా వ్యాపించిపోయింది. కాని ఆ ముక్కయొక్క నిజార్థం మాత్రం హరి బ్రహ్మాదులకైనా అనలేదు.

♦ ♦ ♦ ♦ ♦

వివేకానందరావు నూతనంగా అద్దెకు తీసికొన్న చదువుగది కెదురుగా ఓ మేడవుంది. ఆ మేడమీద ఓపిల్ల వుంది. ఆపిల్లా కళాశాలలో చదువుకొంటూ వుంది. ప్రపంచంతోపాటు ఈ విద్యా ర్థినికూడా, వివేకానందరావు యొక్క హెూమ్ అన్నపలుకు పొడుపుకతే. అయి అయి అప్రయత్నంగా చూస్తూవుంటే ఓనాడు జవాబు విప్పారింది. వివేకానందరావు వున్న గది కిటికీగుండా పైవిద్యార్థిని ఓనాడు తీవ్రంగా చూసింది. చూస్తూ కనిపెట్టింది, వివేకానందరావుకి ఓ పడుచుకుఱ్ఱది కారియరుతో భోజనం తెచ్చి పెట్టడం. "వివేకానందరావు యొక్క హెూమ్ అంటే వెంటనే అర్థంచేసుకుంది. లోలో నవ్వుకుంది. నవ్వుతోపాటు కొంచెం, ఇతరులకు తోపరాని ఈసూకొంది.

♦ ♦ ♦ ♦ ♦

మరి మూడురోజుల్లో "కాలేజి డే" వుత్సవం. ఆ వుత్సవం కార్యక్రమంలో విద్యార్థుల విద్యార్థినుల వినోదవేషాలు అనేది వొకటి వచ్చింది. ఆ వేషాల వరుసలో ఓ వేషం ఇది-పైవిద్యార్థిని ఎందుకు వేసిందో ఆ వేషం మనం చెప్పలేం-కాని వేసింది! ఓ భోజనం తెచ్చిపెట్టే పిల్ల వేషం. చేతిలో కారియర్, కారియర్ మీద అరటాకు మడత–అదీ–అచ్చంగా వేషం వివేకానందరావుకు భోజనం తెచ్చిపెట్టే పిల్లవేషమే!–వేసింది. బహుశా వివేకానంద రావుని ఏడిపించడానికే యుంటుంది.

వివేకానందరావు ఉడుక్కోడానికి బదులు ఉద్రిక్తుడై వెంటనే తన జేబులోవున్న చిట్టి కెమేరా పైకితీసి ఆ విద్యార్థిని యొక్క వినోద వేషాన్ని చాయచిత్రంగా సంగ్రహించాడు. మరొక ళ్ళకు ఈ సంగతి తెలియకుండా ఆపనిచేశాడు. వెంట వెంటనే తయారుచేసి ఆరాత్రే తన గదిలో గోడకు వెల్లడిగా కట్టాడు. కట్టి యెదరిల్లు కనపడకుండా కిటికీ మూసుకున్నాడు—విద్యార్థిని ఏడ్చుకోవాలనో ఏమో—

♦ ♦ ♦ ♦ ♦

మర్నాడు వుదయం పదిగంటలకు మామూలు వేళకు, మామూలు కుర్రది మామూలు వేషంతో మామూలు కారియరుతో మామూలు మీల్సు పట్టుకొని వివేకానందరావు గదిలోపెట్టింది. వివేకానందరావు గదిలోలేడు. దిగువుకు స్నానానికివెళ్ళి స్నానం చేసి గబగబా పైకివస్తూవున్నాడు. పైకివచ్చేలోగా గదిలో పడుచు పిల్ల గోడమీద క్రొత్తగా కనిపిస్తూవున్న ఛాయాపటం చూచింది. చూస్తూ పటం గోడకు బోర్లింపుగా త్రిప్పింది. వివేకానందరావు గదిలోకివస్తూ "ఏంపని అది?" అన్నాడు. పిల్ల "మీరుచేసిన పని బాగున్నదండీ? నన్ను ఫోటోలో దింపవచ్చునటండీ?" అని అడిగింది. లేలేతనవ్వు ఊలవేతగా తేల్చుకొంటూ వుందేమో అన్నంత దీర్ఘం 'అండీ'కి ఇచ్చి "బాగా చూచేవో లేదో నీవు చీరకట్టు కారియర్ మోత నీదికాని, ముఖం నీదికాదు" అన్నాడు వివేకానందరావు విరివిగా నవ్వుతూ ఎదరిల్లు కనబడేలా కిటికీతీస్తూ.

కిటికీగుండా విద్యార్థిని కనిపిస్తూవుంది—విద్యార్థిని వీళ్ళిద్ద రకూ కనిపిస్తూవుంది.

"నేను మీకు మరి మీల్సుతేను. ఆమే తెస్తుంది" అంది గదిలోని కుఱ్ఱది. అవతలపిల్లను వేలెట్టి చూపుతూ. అవతలపిల్ల అనగా ఆ విద్యార్థిని ఒక పెద్ద గడకర్ర తీసుకుని అడ్డంగా వీధి మీద చాపి "ఒసేవ్! కారియర్‌పిల్లా! నన్నింకోమాటు అలా

వేలెట్టి చూపావా అంటే ఈ గడతో నీకళ్లు పొడిచేస్తాను" అంది. అలా ఆమె అంటూనేవుంది వివేకానందరావు గడచివరపై ఫొటో గ్రుచ్చాడు. "ఏమిటా అది?" అని విద్యార్థిని గడలాక్కు చూచు కొంది కదా తన వినోదవేషం!

ఎప్పుడూ మాట్టాడంది "ఇంకా ఇలాంటివి ఎన్ని కాపీ లున్నాయి?" అని కేకేసింది విద్యార్థిని. "ఎన్నైనా వున్నాయి! నేనొక్కర్తెను కనబడుతూ వున్నానా?" అని అరిచించి గదిలో పడుచు.

వివేకానందరావుకి తనగది కిటికీ తీసివుంచాలో వెంటనే మూసి వెయ్యాలో బోధపడలేదు.

... ... ... ... ...

## జొవిుపల్లి కిసివిుసి

పడకప్పటి కలల్లాగు నడకప్పటి దృశ్యాలొక్కొక్కప్పుడు మనల్ని విడువకుండా వెంటాడిస్తూ వుంటాయి. కలలకంటె మనోహరంగా కూడా వుంటాయి కొన్నికొన్ని నిజమైన కళకాంతులు-మరిపించే మార్గాల మలుపుల్లోనివైతేం ఆ మలుపుల్లో దసులయ్యే మను ష్యుల వైతేం! అలా దసులయ్యే మనుష్యులందు కనవచ్చే మగువల వైతేం!

ఆమె నుదురు నలుపు, కనురెప్ప లంతకన్నా నలుపు, చెవులు నలుపు, చెక్కిళ్ళు నలుపు, ముక్కు నలుపు తక్కింది సరాసరిచుబుకం నలుపు-పోనీ వాతెర దొండపండా అని గమ నించితిమా-అదీ నలుపే. అయితేం ఆ హఠాల్లబ్ధ ముహూర్తమందు పైని వివరించిన సమస్తాన్నీ పచ్చగులాబీ పువ్వురంగువచ్చి మీద పడి ఆవహించి అచ్చంగా ఆవాసనే ఆవన్నె అన్నంత ఉపోద్ఘాత తరంగమై ఆమెచూపునువెల్లి విరియజేసింది చూపులో జేవురింపు మినహా.